# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | పిల్లల కథలు - ప్రయోజనాలు | - డా॥. గెంజి అరుణ | 5 |
| 2. | తెలుగు కథ - కమ్యూనికేషన్ వ్యవస్థల చిత్రణ | - డా॥. ఎవివికె. చైతన్య | 8 |
| 3. | పాల వెంకటసుబ్బయ్య జీవితం - రచనలు | - డా॥. ఎల్లే విజయానందరాజు | 14 |
| 4. | తెలుగు కవయిత్రులు-ప్రపంచీకరణ ప్రతిఘటన స్వరాలు | - డా॥. వి. పవన్ కుమార్ రెడ్డి & - డా॥. పల్లా కృష్ణ | 17 |
| 5. | గురజాడ అడుగుజాడ నిత్యస్మరణీయం | - డా॥. కడివెండి మమత | 22 |
| 6. | గురజాడ వారి బుచ్చమ్మ | - కొండయ్య కోసూరు | 25 |
| 7. | స్త్రీ ఔన్నత్యం | - యమ్. అనంతలక్ష్మి | 29 |
| 8. | శ్రీమద్భాగవతం - వామనుడు | - జి. శ్రీమతి | 33 |
| 9. | విమర్శ - విమర్శకుడు - వివేచనా దృక్పథం | - ఎరికంబట్టు రాజేష్ | 37 |
| 10. | తెలంగాణ ఉద్యమ కయిత | - జె. శంకర్ | 42 |
| 11. | విశ్వనరుడు గుర్రం జాషువా | - డా॥. పెండ్యాల లావణ్య & డా॥. బూసి వెంకటస్వామి | 48 |
| 12. | స్థిత ప్రజ్ఞురాలు ద్రౌపది | - యం. అనిత | 52 |
| 13. | భాగవతంలో ధ్రువుని వైశిష్ట్యం | - కె. నరేష్ | 55 |
| 14. | తెలంగాణ సజీవ కథలు ''లొట్టపీసు పూలు'' | - Md. గౌస్ పాషా | 60 |
| 15. | ఇందూరు సాహితీవనంలో 'సూరారం' గజల్‌ల జల్లు | - మున్నం శశి కుమార్ | 63 |
| 16. | ఆచార్య ఇనాక్ 'పైమెట్టు' నవల-దళిత స్త్రీ అస్తిత్వ పోరాటం | - సురేఖ దుగులూరు & - డా॥. వై. సుభాషిణి | 65 |
| 17. | తెలంగాణ సాంస్కృతిక చైతన్యంలో బతుకమ్మ గేయాలు - వైశిష్టం | - వి. వినయ్ కుమార్ | 69 |
| 18. | తెలుగు సాహిత్యంలో కొత్తవేకువ - జగ్‌నే కీ రాత్ | - షేక్ హుస్సేన్ | 74 |
| 19. | తెలుగు సినీగేయాల్లో వ్యక్తిత్వ వికాసం | - డా॥. చింతల రాకేశ్ భవానీ | 77 |
| 20. | తండా కన్నీరు కారుస్తుంది! | - డా॥. మహ్మద్ హుసేన | 81 |
| 21. | సాహితీ స్రష్టల సాహితీ రూపాన్ని ఆవిష్కరించిన నియోగి | - నాగెల్లి ప్రభాకర్ | 85 |
| 22. | తెలుగు వాఙ్మయం - కథాకావ్యాల వైశిష్ట్యం | - డా॥. ఎం.మునిరత్నం | 89 |
| 23. | తెలుగు గజల్ స్వరూప స్వభావాలు | - డా॥. నందిరెడ్డి పురుషోత్తమ రెడ్డి | 91 |
| 24. | సుందర వెలుతురు యాత్ర | - డా॥. పి.ఎ. సత్యనారాయణ | 93 |
| 25. | స్నేహితుల్ని హత్తుకున్న స్మృతి కవిత్వం | - సుంకర గోపాలయ్య | 97 |
| 26. | భాష - ఆధునీకరణ - సమస్యలు | - డా॥. డి. ఉదయ కుమారి | 100 |
| 27. | వీరవల్లడు - మానవతామూర్తి | - డా॥. పి. విశ్వప్రసాదు | 102 |
| 28. | పాలమూరు జిల్లాలో స్నేహలతా కవితా సంఘం ... | - డా॥. సి. నర్సింహులు | 105 |
| 29. | కాకిపడిగెల కథన నైపుణ్యం | - డా॥. పుట్ట యాదేశ్ | 110 |
| 30. | తెలంగాణ జీవన చిత్రం - కాళోజి కవిత్వం | - పులిగిల్ల ఉపేందర్ | 118 |
| 31. | పి. సరళాదేవి జీవితం, సాహిత్యం - పరిచయం | - డా॥. సారిక విజయలక్ష్మి | 121 |
| 32. | Lights! Camera! Action! And the Birth of Historical Film | - Dr. Sebastian Joseph | 124 |
| 33. | Reimagining Resources : A Note on Dalit Land... | - Joby Mathew | 132 |
| 34. | Problems of Translating Cultural Elements ... | - Thoudam Jomita Devi | 137 |
| 35. | The Place of Women in Indian Society | - Sahithi Modugula | 140 |
| 36. | A Phonemic inventory of vowels in Thoti | - Dr. N. Susheel Kumar | 144 |

# తెలుగు కవయిత్రులు – ప్రపంచీకరణ ప్రతిఘటన స్వరాలు

– డా॥. వి. పవన్ కుమార్ రెడ్డి
తెలుగు అధ్యాపకులు, సి.యస్.యస్.ఆర్ &
యస్.ఆర్.ఆర్.యం. డిగ్రీ & పి.జి. కళాశాల,
కమలాపురం, కడప.

– డా॥. పల్లె కృష్ణ
తెలుగు అధ్యాపకులు, సి.యస్.యస్.ఆర్ &
యస్.ఆర్.ఆర్.యం. డిగ్రీ & పి.జి. కళాశాల,
కమలాపురం, కడప.

ఇవాళ ప్రపంచీకరణ చుట్టుముట్టని రంగం కానీ, ప్రజానీకం కానీ లేదు. పెట్టుబడిదారీ విధానం యొక్క అత్యున్నత దశ సామ్రాజ్యవాదం. సామ్రాజ్యవాదం యొక్క పరాకాష్ఠ రూపం ప్రపంచీకరణ. ప్రపంచీకరణ అంటే ప్రపంచమంతా ఒకటి కావడం.ఒకటి కావడమంటే ప్రేమ, సహకారం, శాంతి మొదలగున అర్థాల్లో ఒకటి కావడం అని మాత్రం కాదు. ఏ దేశాల మధ్యనైనా ఎటువంటి ఆంక్షలూ లేకుండా వ్యాపారం కొనసాగించవచ్చునని అర్థం. దీనినే "స్వేచ్ఛా వాణిజ్యం" అని పిలుస్తారు.

వర్ధమాన దేశాలలో ప్రపంచీకరణ దుష్ప్రభావం వల్ల వ్యవసాయ రంగ సంక్షోభం, వృత్తుల విధ్వంసం, సంస్కృతి పతనం మొ॥ విపరీత పరిణామాలు నెలకొన్నాయి. మహిళలు కూడా ఇందుకు మినహాయింపు కాదు. పై పెచ్చు ప్రపంచీకరణ దుష్ఫలితాలు అన్నింటితో పాటు లింగ వివక్ష కూడా వీరికి తోడవుతున్నది.

1980 వ దశాబ్దంలో వెలువడ్డ స్త్రీవాద కవిత్వం ఆధునిక తెలుగు కవిత్వాన్ని సంపద్వంతం చేసింది. ఎంతో మంది తెలుగు కవయిత్రులు తమ పదునైన భావాల్ని కవిత్వంలో వ్యక్తీకరించారు. పురుషాధిత్య భావజాలంపై ఎంత బలంగా తమ కవితాస్త్రాలని సంధించారో అంతే బలంగా ప్రపంచీకరణ భావజాలంపై కూడా సంధించారు. 1991 లో నూతన ఆర్థిక విధానాల్ని మన దేశంలో ప్రవేశపెట్టారు. అప్పటినుంచీ ప్రపంచీకరణ అనే భావన ప్రచారంలోకి వచ్చింది. ప్రపంచీకరణ నేపథ్యంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. స్త్రీలని ఒక సరుకుగా, మార్కెట్ ప్రచార కర్తలుగా జరిగింది. వీటన్నింటిని తెలుగు కవయిత్రులు మొదటి నుంచీ ప్రతిఘటిస్తూ వస్తున్నారు. వ్యవసాయం, సంస్కృతి అంశాలలో ప్రపంచీకరణ దుష్ప్రభావాన్ని తెలుగు కవయిత్రులు ప్రతిఘటించిన తీరును వివరించడం ఈ వ్యాసం యొక్క ఉద్దేశ్యం.

వ్యవసాయం - సరళీకృత ఆర్థిక విధానాలు మన దేశంలో ప్రవేశపెట్టడం మూలంగా వ్యవసాయరంగం అతలాకుతలమైంది. ఈ విషయాలపై తెలుగు కవులు స్పందిస్తూ వచ్చారు. ఇందులో స్త్రీలు కూడా ఉన్నారు. మన గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మహిళలు వెన్నెముక వంటి వారు. పశుపోషణ, ఇంటిపనితో పాటు పొలం పనుల్లో నాట్లు వేయడం, పంటకోతలు, నూర్పిడి, పశుగ్రాస సేకరణ, పాలు పితకటం వంటి పనుల్లో అధికశాతం మహిళల శ్రమ ఉంది.

వ్యవసాయ రంగంలో జన్యుమార్పిడి విధానాలతో, టెర్మినేటర్ విత్తనాలతో రైతులు కుదేలయ్యారు. ఇటువంటి కృత్రిమ విధానాల్ని తెలుగు కవయిత్రులు ప్రతిఘటించారు. "కొత్తా దేవుడండీ.." అనే కవితలో కవయిత్రి కల్పనా రెంటాల కృత్రిమ విధానాల్ని వ్యతిరేకించారు.

"మొక్కల చివుళ్లు
దూడలు తాగే అమ్మపాలు
ఇక అన్నీ జెనెటిక్ ఉత్పత్తులే
కడుపులో పిండాలకు
టెర్మినేటర్ విత్తనాలు చల్లండి
అన్నదాతల ఆత్మహత్యలకు
మోనోక్రోటోఫాస్ అమ్ముకోండి"

అంటూ కవయిత్రి నిరసన వ్యక్తం చేసింది. బహుళ జాతి సంస్థల ప్రచారం వ్యవసాయరంగాన్ని దెబ్బతీస్తున్నది. మోన్‌శాంటో కంపెనీ ప్రవేశపెట్టిన బి.టి. పత్తి రకం వల్ల సాగులో తెగుళ్ళ నివారణ జరగలేదు. దిగుబడులు పెరగలేదు. రైతులు ఆశించిన పంట చేతికి రాకపోవడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ విధానాలు, బ్యాంకుల రుణాలు రైతుల ఖననానికి కారణాలు.

పత్తి రైతుల ఆత్మహత్యల నేపథ్యంలో ఓల్గా రాసిన "చావుని కాదు బతుకుని" అనే కవితలో సగటు రైతు భార్య కన్నీటి ఘోష వినిపిస్తుంది.

"విషంతో నీకు చావు దొరికింది
నా బతుకు చేదు విషం అయింది
పత్తి పంట నిన్న మొన్నటిదాయె
మన సంసారం యెన్నాళ్లిది?"

అంటూ ప్రశ్నిస్తుంది. భర్త మరణించిన తర్వాత తనని, తన పిల్లల్ని గురించిన ఎరుకను కవయిత్రి చెబుతుంది.

"నీ పంట నాశనమవటమే చూశావు గానీ
నా కడుపు పంట సంగతి యేమాలోచించావు
పురుగు కొరుక్కుతినే పత్తికాయల్లా
వీళ్ళనెట్లా గాలికొదిలెయ్యను? ........
నోరు తెరిచి అడగాలయ్యా !
ఇదంతా యేమిటనీ
ఎందుకిట్లా జరుగుతోందనీ ?
"ముద్దకే కాదు
యుద్ధానికీ పిడికిలి బిగించాలని
నా పిల్లలకు నేర్పటానికి
నేను బతికి తీరతానయ్యా !"

అంటూ కవయిత్రి ధైర్యాన్నిస్తుంది. ప్రభుత్వ విధానాల పట్ల, రైతుల మరణానికి గల కారణాల పట్ల ప్రశ్నించమని, పోరాటానికి సిద్ధపడమని కవయిత్రి బతుకు పట్ల భరోసాని ప్రకటిస్తుంది.

భారతదేశంలో తొలిరకం బిటి వ్యవసాయ ఉత్పత్తి పత్తి. తాజాగా బిటి వంకాయకు అనుమతి లభించడంతో, ఇది తొలి బిటి ఆహారోత్పత్తి అవబోతోంది. ప్రపంచంలోనే తొలి జన్యుమార్పిడి కాయగూర ఇది. రైతులు, పర్యావరణ వేత్తలు, సామాజిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థల అభ్యంతరాలను, ఆందోళనలను బేఖాతరు చేస్తూ ప్రపంచంలోనే తొలిసారిగా భారత్‌లో బిటి వంకాయ ఉత్పత్తికి ద్వారాలు తెరుచుకున్నాయి.

బిటి వంకాయలు మన తిండినీ, ఆరోగ్యాన్నీ ప్రభావితం చేస్తాయి. మన దేశంలో బహుళజాతి సంస్థలు 'బయో'త్పాతం సృష్టించకుండా అప్రమత్తంగా ఉండాలని కవయిత్రి పాటిబండ్ల రజని "మిత్తికి లొంగని విత్తనం" అనే కవితలో హెచ్చరించినది.

"కోళ్ళ కోసం నక్కిన బావల్లా -
వంగ తోటల్లో దూరే దొంగ బావలొస్తున్నారు
చెంగు దోపవే చెల్లెలా !
గుత్తి వంకాయల్లో మృత్యు మసాలా కూరేందుకు -
విదేశీ విషప్పురుగులు ఉవ్విళ్ళూరుతున్నాయట
అట్లకాడ కాల్చవే అక్కయ్యా ! ..... .....
సాఫల్య కేంద్రాల్లో శీతలీకరించే కణాల కంటే
నూరుపాళ్ళు నికార్సుగా, జీవాన్ని ఏడాది పాటు
పిడకల్లోనో, బూడిదలోనో దాచిపెట్టి
మానవ జాతికి మహా భోజనపు సంకేతంలా వీచే
తొలకరి మట్టివాసనకు పులకలెత్తి పోతూ,
కొత్త పెళ్ళికూతుర్లా చెంగుపట్టే నేలమ్మ నుదుట
విత్తనపు బొట్టెట్టి ఒడి నిండాలని దీవించే
నీ పచ్చని పందిట్లో బైసన్లను మేపుతారట !"

అంటూ కవయిత్రి బిటి వంకాయల్ని ప్రవేశపెట్టే విదేశీ కంపెనీల విషప్పురుగులు వస్తున్నాయని వాటిని వ్యతిరేకించాలని, జాగ్రత్త పడాలని సూచిస్తుంది. చీడ పేరు చెప్పి ఈ విదేశీ కంపెనీలు మన దేశంలో ప్రయోగాలు చేస్తున్నాయి. వీటి పట్ల సన్నద్ధంగా ఉండాలని కవయిత్రి ప్రజల్ని పోరాటోన్ముఖుల్ని చేస్తుంది.

"వీళ్ళకేం తెలుసులే 'వంకాయ్' అని, దొంగలు
దొంగలు కలిసి
మన వంగను పట్టుకుంటుంటే -
నాలుగు పక్షాలుగా చీల్చినా ఒక్కటిగా ఉండే
గుత్తొంకాయ తిన్న ఐకమత్యంతో,
మెట్టొంకాయలా పిడికిలి గట్టిగా బిగించి
మోన్‌శాంటో మొహాన గుద్దుదాం !
అంగరంగ వైభవంగా మన వంగను
ఊరూ వాడా నోరూరేలా ఊరేగిద్దాం !"

వంకాయ తెలుగు వారి ఆహారపు అలవాట్లలో ఒక భాగం. వంకాయ కూర లేకుండా ఏ శుభకార్యం జరగదు. మన గుత్తొంకాయకు అనాది నుండి ఎంతో ప్రాశస్త్యం ఉంది. అటువంటి మన వంకాయని మనదైన ఆహారపు రుచిని మనం కోల్పోకూడదు. మోన్‌శాంటో కంపెనీ తయారు చేసిన బిటి వంగసాగుని దేశంలోకి ప్రవేశించకుండా ప్రతిఘటించాలని కవయిత్రి పిలుపు నిచ్చింది.

### సంస్కృతి :

ప్రపంచీకరణ ప్రభావంతో మనదైన సంస్కృతి పతనావస్థకు చేరుకొంది. మానవ జీవన విధానమే సంస్కృతి. ప్రపంచీకరణ రెండు రకాల సంస్కృతుల్ని తెచ్చి పెట్టింది. అవేమంటే వస్తు వ్యామోహ సంస్క ృతి, వస్తు వినిమయ సంస్కృతి. మనుషుల కంటే మానవీయ విలువల కంటే వస్తువులకూ, సరుకులకూ ప్రాధాన్యం ఇవ్వడం, ఎక్కువగా వాటిమీదనే వ్యామోహం పెంచుకోవడం వస్తు వ్యామోహ సంస్కృతి. ఈనాటి మార్కెట్ ప్రపంచంలో వస్తువులు లేదా సరుకులే తమ వినియోగం కోసం మనుషుల్ని తయారు చేసుకుంటున్నాయి. ఇదే వస్తు వినిమయ సంస్కృతి.

కొండేపూడి నిర్మల రాసిన "జీవితం వర్సెస్ ట్రూప్ బజార్" అనే కవిత వస్తు వ్యామోహ సంస్కృతిని చిత్రించినది.

"ఒక పింగాణీ అట్టహాసం
ఒక ప్లాస్టిక్ డబాయింపు
ఒక లోహపు డమ డమ
మనుషుల్ని తరిమికొడుతున్న మార్కెట్లో
మానవ విలువలు తక్కెడలో వున్నాయి
కొంటారా ? అమ్ముతారా ?"

అంటూ మానవ విలువల్ని వస్తు విలువలు ఆక్రమించిన తరుణాన్ని గుర్తు చేశారు. అటువంటి వస్తు విలువలు మన జీవితంలోకి ప్రవేశించాక, ఇక మన మధ్య ఆ వస్తువుల గురించిన విషయాలు మాత్రమే కొనసాగుతాయని ఇదే కవితలో కవయిత్రి వ్యక్తం చేసింది.

"వస్తువు బరువుకి మాట అగాధంలో పడిపోవచ్చు
వస్తువు మోతకి జీవన సంగీతం మూగబోవచ్చు
ఖండాంతరాల దూరం నుంచి పుష్కరానికోసారి
పుట్టింటి కొచ్చిన మా అక్కా చెల్లెళ్ళ మధ్య
తరచుగా దొర్లేవి వస్తువుల గురించిన సంబరాలే"

ఇవాళ ఈ విషయాలన్నీ మన అనుభవంలోకి వచ్చాయి. వర్తమాన జీవితాన్ని ప్రతిఫలించినదీ కవిత. మానవ సంబంధాలు వస్తు సంబంధాలుగా పరిణమించిన తీరు కనబడుతున్నది.

అందాల పోటీల గురించిన విస్తృత ప్రచారం ద్వారా అందాన్ని గురించిన తప్పుడు భావనల్ని వ్యాపింపజేసి, తద్వారా సామ్రాజ్యవాద కంపెనీల తయారీ సౌందర్య సాధనాలను హెచ్చుగా వినియోగంలోకి తెచ్చి మార్కెట్ చేసుకోవాలనేది ముఖ్య లక్ష్యంగా ఉంది. మార్కెట్‌లో ఒక సరుకు అమ్మ బడాలంటే ఒక అందమైన స్త్రీ దాని విలువను ప్రచారం చేయవలసిన పరిస్తితి ఈనాడు వచ్చింది. దానిలో భాగంగా స్త్రీ శరీరాన్ని ఒక సౌందర్య మూర్తిగా మలచవలసి వచ్చింది. స్త్రీలు సౌందర్యం కోసం ప్రయత్నించడం అదొక హింస లాంటిదని విమల రాసిన "సౌందర్యాత్మక హింస" కవితలో వెల్లడించింది

"అందం పోటీయైన చోట
అందం 'సరుకై'న చోట
అందాల వ్యాపారాల్ని ద్వేషిద్దాం"

అని పిలుపునిచ్చింది. అందం అనే భావజాలం వెనుక మార్కెట్ చేసే ప్రచార కుట్రని తెలుగు కవయిత్రులు తేటతెల్లం చేశారు.

కొండేపూడి నిర్మల రాసిన "మల్టీ నేషనల్ ముద్దు" అనే కవిత అందాల పోటీల్ని నిరసించినది.

"అందాల గారడీ
నా ఇంటిల్లిపాదినీ బొమ్మలు చేసింది
అమ్మ బొమ్మ, కూతురి బొమ్మ, అమ్మమ్మ బొమ్మ
కుక్క పిల్ల బొమ్మ -
ఎవరి కన్ను మూసి తెరిచినా మిస్సిండియా కలలే"

ప్రపంచీకరణ తెచ్చిన ఈ సౌందర్య పిపాసకు వయసుతో సంబంధం లేదు. నేడు తామర తంపరగా పెరుగుతున్న బ్యూటీపార్లర్లు, కాస్మెటిక్ సర్జరీ హాస్పిటళ్లు కృత్రిమ అందాల వ్యామోహాల్ని సంతృప్తి పరుస్తున్నాయి. సౌందర్య మత్తు నుంచి బయటపడాలని కవయిత్రులు సూచిస్తున్నారు. కొండేపూడి నిర్మల ఇదే కవితలో అటువంటి ప్రయత్నం చేసింది.

"ఉగ్గబట్టిన సౌందర్యాన్నభినయించే ప్రతి గాయమూ
మారకపు విలువే తప్ప
మరేదీ కాదు .....
వెనకటి తరం శారీరక స్పృహ కంటే
అందాల వ్యాపారం కోసం
అందవిహీనమవుతున్న వ్యవస్థకి బానిసగా
ఈ సామాజిక స్పృహే నన్నెక్కువ దగా చేస్తోంది"

అంటూ వర్తమాన కాలపు వాస్తవ జీవితాన్ని గూర్చి చెప్పారు. అందం అనేదే ప్రపంచ స్థాయిలో పెద్ద పరిశ్రమగా రూపొందింది. వందల కోట్ల రూపాయల లాభాలను సులువుగా, నికరంగా పొందటానికి అందం అనే భావజాలమే పెద్ద పెట్టుబడిగా ఉపయోగ పడుతోంది. అదే విధంగా ప్రపంచీకరణ నేపథ్యంలో పర్యాటక రంగ అభివృద్ధి పేరుతో సెక్స్ టూరిజాన్ని ప్రోత్సహిస్తున్నారు. మూడో ప్రపంచ దేశాల్లో ప్రత్యేకించి ఆగ్నేయాసియా దేశాల్లో 1970 తర్వాత అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ సెక్స్ టూరిజం. ప్రధానంగా విదేశాల నుంచి వచ్చే సంపన్నుల విలాస అవసరాలు తీర్చడానికి తొమ్మిదేళ్ళ నుంచి పది పదిహేనేళ్ళ వయసున్న రెండువేల మంది అమ్మాయిలతో ఒక సెక్స్ టూరిజం పరిశ్రమ ఉత్తర బ్రెజిల్‌లో విస్తరిస్తున్నదని లాటిన్ అమెరికా పత్రిక ఒకటి రాసింది. ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలే దీనంతటికీ కారణం.

పాటిబండ్ల రజని రాసిన "ఎర్రజాబిళ్ళ ఎరీనా!" అనే కవిత బాల వేశ్యల కోసమే సెక్స్ టూరిజం పేరిట మన దేశానికొచ్చే విదేశీ వింత పశువుల వికృతానందానికి చలించి రాసినటువంటి కవిత.

"రండి బాబూ రండి
వెల్‌కమ్ టు ఇండియా
ఇప్పుడిది
మొగ్గ మెహందీల ఏరియా ! .....
తాజ్‌మహల్ చలువ పలకలు
మీ తాపం తగ్గించవని
తాజాగా తల్లి పేగు తెంచిన
తడి బొడ్లను తట్టల్లో పేర్చాం ! .....
మీ సెక్స్ బాత్ కోసం మా గోవాబీచ్
తడిదేరని పసితనువుల ఇసుక పర్రల్తో
తయారుగా పక్క పరచి ఉంచింది .....
పర్యాటక మారకం చెల్లించి నంతనే దక్కే
పసిగాయాల ఫలహారాలు -
ఇంకెక్కడైనా మీకు చిక్కేనా ?
అయ్యా !
అందుకే ఇది ఎర్రజాబిళ్ళ ఎరీనా !"

అంటూ కవయిత్రి ఆవేదనతో,ఆర్తితో వెల్లడించారు. ముక్కుపచ్చలారని పసిపిల్లల్ని బలిచేస్తున్న వికృత

సంస్కృతి ఇది. స్త్రీని సరుకుగా, అంగడి బొమ్మగా, మాంసం ముద్దగా చూసే సంస్కృతికి ముద్దుపేరు పర్యాటక రంగం అభివృద్ధి. పర్యాటక రంగం ముసుగులో మానవ మాంస వ్యాపారానికి తలపడిన తలపడిన వింత సంస్కృతి ఇది. ఈ విధంగా తెలుగు కవయిత్రులు ప్రపంచీకరణ విధానాల మూలంగా చోటు చేసుకుంటున్న విపరిణామాలను అక్షరబద్ధం చేశారు. ప్రపంచీకరణ పట్ల తమదైన రీతిలో ప్రతిఘటన స్వరాలను వినిపించారు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. నేను కనిపించే పదం - కల్పనా రెంటాల
2. రైతు కవిత - సంపా॥ పాపినేని శివశంకర్, బండ్ల మాధవరావు, ఎమ్వీ రామిరెడ్డి
3. కవిత 2010 - సంపా॥ పాపినేని శివశంకర్, దర్భశయనం శ్రీనివాసాచార్య
4. మల్టీ నేషనల్ ముద్దు - కొండేపూడి నిర్మల
5. ఎర్రజాబిళ్ళ ఎరీనా - పాటిబండ్ల రజని

**విమర్శ :**

1. వచన కవిత్వంలో వర్తమాన రైతు (వ్యాసం) - మేడిపల్లి రవికుమార్ ప్రస్థానం ప్రత్యేక సంచిక, హైదరాబాద్, 2008.
2. అమ్మకానికి ఆంధ్రప్రదేశ్ - ఎన్. వేణుగోపాల్, విశ్లేషణ ప్రచురణలు, హైదరాబాద్, 1999.